విద్యా పరిశోధనకు అధిక ప్రాధాన్యత : విసి

ప్రజాశక్తి కడప అర్బన్

విద్యార్థుల విద్యా ప్రగతి, అధ్యాపకుల పరిశోధనలతో శాఖల అభివృద్ధి జరగాలని యోగివేమన విశ్వవిద్యాలయ వి సి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయ ఐటీ సెల్ సంచాలకులు ఆచార్య ఎం.వి. శంకర్ ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్, జెనెటిక్ అండ్ జీనోమిక్స్, మైక్రోబయాలజీ, పర్యావరణ శాస్త్రాలు సమగ్ర సమాచారంతో ఆధునికరించిన వెబ్‌సైట్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వి సి మాట్లాడుతూ బోధన,పరిశోధన, అభివృద్ధిలో శాఖల మధ్య పోటీ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆచార్య విజయ రాఘవ ప్రసాద్, సహాచార్యులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ముని కుమారి, డాక్టర్ సుమిత్ర, ఐటి సెల్ సాంకేతిక విభాగ ప్రతినిధి హకీబ్ పాల్గొన్నారు.

ప్రత్యేక నవజాత శిశువిభాగం ఏర్పాటుకు

కసరత్తు

రూ.60 లక్షలతో ప్రతిపాదనలు
20 అదనపు బెడ్స్ ఏర్పాటు
ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రత్యేక నవజాత శిశు విభాగం ఏర్పాటుకు కసరత్తు ఊపందుకుంది. జిజిహెచ్ అధికార యంత్రాంగం ఆగస్టు నెలాఖరు నాటికి ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది. జిల్లా సర్వజనాస్పత్రి వెనుకభాగంలోని అదనపు భవనాలను ఎంపిక చేసింది. వైద్య అవసరాలు, పరికరాలకు అవసరమైన వసతుల కల్పనకు సంబంధించి రూ.60 లక్షలతో కూడిన ప్రతిపాదనలు అందజేసింది. జిజిహెచ్‌లో గర్భిణులకు, నవజాత శిశుసంరక్షణ మెరుగైన చికిత్స అందిస్తున్న నేపథ్యంలో నిరుపేదలు, పేదలు, దిగువ మధ్య తరగతి, మధ్యతరగతి ప్రజానీకం జిజిహెచ్‌ను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. జిజిహెచ్‌లో కాన్పుల

విభాగం మొదలుకుని నవజాత శిశువిభాగానికి రోజురోజుకూ ఒత్తిడి పెరిగిపోతోంది. కాన్పుల విభాగంలో బెడ్‌కు ఇద్దరు, ముగ్గురు చొప్పున వైద్య చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. దీనికి అదనపు విభాగమైన నవజాత శిశువిభాగంలో 20 బెడ్స్ నిండిపోతోంది. మరో 20 అదనపు బెడ్‌లకు అనుమతి లభించింది. మొత్తం 40 బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేక నవజాత శిశువిభాగంలో కీలకమైన వైద్యపరికరాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఇందులో ప్రధానంగా ఫొటోథెరఫీ, వార్మర్, ఇంక్యుబేటర్, సి-క్యాప్ యూనిట్స్, సెంట్రల్ ఆక్సిజన్ పరికరాలు, ఆంటల్ సెక్షన్ వంటి పరి కరాలను ఏర్పాటు చేయనున్నారు. వీటికి రూ.34 లక్షలు వెచ్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా జిజిహెచ్‌లో ప్రత్యేక ఎసెన్సియా ఏర్పాటుకు అనుమతి లభించిన నేపత్యంలో నెలలు నిండక ముందే పుట్టిన నవజాత శిశువులకు మెరుగైన వైద్యసేవలు అం దుబాటులోకి వచ్చే అవకాశం ఉందని చెప్పవచ్చు.

విద్యార్థి సోహిత్ మృతి గురించి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పి అన్బురాజన్

విద్యార్థి సోహిత్ మృతిపై ఎస్పి విచారణ

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి సోహిత్(11) అనుమానాస్పద మృతిపై విచారణ కొనసాగుతూనే ఉంది. సోమవారం ఎస్పి అన్బురాజన్ పాఠశాలను సందర్శించారు. సోహిత్ మృతి ఘటనకు సంబంధించి పాఠశాల సిబ్బంది, విద్యార్థులను విచారించారు. సోహిత్ ఉన్న తరగతి గది, వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహంలో సిసి పుటేజీ, పోస్ట్ మార్టం నివేదికల ఆధారంగా పూర్తి వివరాలను రెండు రోజుల్లో మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు ఎస్పి తెలిపారు. సోహిత్ వేలి ముద్రలు, డాగ్ స్క్వాడ్ ద్వారా మరింత లోతుగా విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు. సిసి పుటేజ్‌లో విద్యార్థి పైఅంతస్తు నుంచి కింద పడినట్లు ప్రాథమిక అంచనా ద్వారా వెల్లడైందని మైదుకూరు డిఎస్‌పి వంశీధర్‌గౌడ్ ఎస్‌పి అన్బురాజన్‌కు వివరిం చారు. విద్యార్థి వసతి గృహాన్ని, తోటి విద్యార్థులను కూడా విచారించినట్లు పోలీసు ఉన్నత అధికారులు చెప్పారు. సోహిత్ మృతి ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను విచారణ అనంతరం వెల్లడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ కుల్లాయప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి మృతి

కడప అర్బన్ : సాహితీ వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ శస్త్ర వైద్యనిపుణులు డాక్టర్ మల్లెమాల వేణు గోపాల్ (85) సోమవారం ఉదయం మృతి చెందారు. మరణ వార్త సాహితీమిత్రులు, పురప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన పార్థివదేహాన్ని ప్రముఖులు మాజీ మంత్రి ఎస్. రామమునిరెడ్డి, డాక్టర్ మహబూబ్ పీర్, విద్యావేత్త అలపర్తి చౌదరి, డాక్టర్ పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ మూలా మల్లికార్జునరెడ్డి, సాహితీవేత్తలు సందర్శించి నివాళులర్పించారు. బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కడప కవిత విద్యా సాంస్కృతిక సేవాసంస్థ అధ్యక్షులు అలపర్తి చౌదరి డాక్టర్ వేణు గోపాలరెడ్డి మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

కలెక్టర్‌కు ఉద్యోగుల సమస్యలు వివరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన క్యారదర్శి మనోహర్

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులుగా అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం స్పందనలో కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు స్వచ్ఛ భారత్ పరిధిలో క్లాప్ ఆధ్వర్యంలో సాయిప్లవి, రెడ్డి ఏజెన్సీ ద్వారా చెత్తను సేకరిస్తున్నారని తెలిపారు. సాయిపల్లవి, పావని ఏజెన్సీ వారు బండ్ల డ్రైవర్లకు రూ.10,050 వేతనం ఇస్తున్నారని పేర్కొన్నారు. రెడ్డి ఏజెన్సీ ద్వారా నడుస్తు బండ్ల డ్రైవర్లకు రోజుకు రూ.400 ఇస్తున్నారని తెలిపారు.పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం లేదన్నారు. రెడ్డి ఏజెన్సీ వారికి కార్పొరేషన్ వారు ఒ కాంట్రాక్ట్ ఉద్యోగికి ఏరోజుకు ఆరోజు రూ.400 చెల్లించి పెట్రోల్‌కు డబ్బులు ఇస్తున్నారని తెలిపారు. విచారణ చేసి సాయిపావని, రెడ్డి ఏజెన్సీపై చర్యలు తీసుకుని క్లాప్ డ్రైవర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిఒ నంబరు ప్రకారం రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జమ్మలమడుగు డివిజన్ మైలవరం మండలం నవాజుపేట దగ్గర ఉన్న దాల్మియా సిమెంట్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డ్స్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. వీరికి సెలవులు లేవని, నెలకు 30 రోజులు పని చేయాలని తెలిపారు. రోజుకు 12 గంటలు విధులు నిర్వాహించాలని చెప్పారు. వీరికి 8 గంటల పనిదినాలు, సెలవులు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థి మృతిపై న్యాయ విచారణ చేయాలని

ఖాజీపేట మండల పరిధిలోని భీరం శ్రీధర్ రెడ్డి విద్యార్థి అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించాలని కార్యాలయంలో అడిషనల్ ఎస్‌పిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐజిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిన్ని , శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నర్సింహులు, నాయకులు రవి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కాంట్రాక్టు ఉద్యోగుల సలహాలోనే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం జిజిహెచ్ ఒపి బ్లాక్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎడ్యుకేషన్‌లో ఏమాత్రం తేడాల్లేవు, వారు పని చేసే విధానంలో కూడా తేడాల్లేవు కానీ వారికి ఇచ్చే వేతనాల్లో తేడాలు ఉన్నాయని చెప్పారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం 2014, జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారిని అందరిని రెగ్యులర్ చేస్తామని చెప్పిందన్నారు. ఇది సంతోషించాల్సిన విషయమని తెలిపారు. ఆ పద్ధతిలోనే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ అయ్యేంతవరకు ఆప్కాస్ ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని ఆప్కాస్ కార్మికులకు అమలు చేయాలని పేర్కొన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న తల్లిదండ్రులకు వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లను ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని వెంటనే పునరుద్ధించాలని పేర్కొన్నారు. చేశారు. ఆప్కాస్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే ఎక్కువ వేతనం తీసుకుంటున్నారని, అయినా కాంట్రాక్టు ఉద్యోగుల పిల్లలకు మాత్రం అమ్మ ఒడి పడిందని, ఆప్కాస్ ఉద్యోగుల పిల్లలకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగులపైన సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు భాస్కర్, బాలాజీ రావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజారత్నం, కమిటీ సభ్యులు జయరాం, సుబ్బారావు, లక్ష్మయ్య, బాదుల్లా, పవన్, మరియమ్మ, జయసుధ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

మరణాల నివారణకు ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని విద్యాసంస్థల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థుల మరణాల నివారణకు అధికార యంత్రాంగం జోక్యం చేసుకుని తక్షణమే సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వారం రోజులుగా విద్యార్థులు మరణాలకు గురవుతున్నారని తెలిపారు. ఇది బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. విద్యా సంస్థల యజమానులు, విద్యార్థి సంఘాలు, పోలీసులు, రవాణాశాఖ అధికారులతో తక్షణమే ఒక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అభం శుభం తెలియని చిన్నారుల జీవితాలు బుగ్గిపాలు కాకుండా చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఖాజీపేట, జమ్మలమడుగు ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఫరూక్ పాల్గొన్నారు.

దుష్ప్రచారం తగదు

కడప అర్బన్ : కొన్ని రోజులుగా దుగ్గాయపల్లి బ్రదర్స్ అంటు తమపై కొందరు దుష్ప్రచారం చేయడం తగదని వల్లూరు జడ్‌పిటిసి దుగ్గాయ పల్లె వీరారెడ్డి అన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రెడ్డి చనిపోయి 11 రోజులు కావస్తుందని చెప్పారు. కొంతమంది పనిగట్టుకుని తమను టార్గెట్ చేయడం సరికాదని తెలిపారు. తమ కుటుంబం ప్రజల కోసమే పనిచేస్తుందని పేర్కొన్నారు. తాము అరాచకాలు చేసి ఉంటే ఏ పోలీస్ స్టేషన్ అయినా కేసులు ఉన్నాయేమో చూపించాలన్నారు. ఎక్కడైనా అక్రమంగా 1 సెంటు భూమి కబ్జా చేసినట్లు నిరుపిస్తే అదే మీకే రాసిస్తామని తెలిపారు.

వ్యాపారవేత్తల సౌకర్యార్థం ఎస్ఎంఇ సేవలు

ప్రజాశక్తి - కడప అర్బన్

సేవలను ప్రారంభిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖ మీనన్

నగరంలో ఎస్‌బిఐ నూతనంగా ఏర్పాటు చేసిన తమ ఎస్ఎంఇ బ్రాంచ్ సేవలను సద్వినియోగం చేసు కోవాలని ఎస్‌బిఐ కర్నూలు డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖ మీనన్ తెలిపారు. సోమవారం నగరం విజయదుర్గ కాలనీలో ఏర్పాటు చేసిన ఎస్‌బిఐ, నాగరాజుపేటలోని ఎస్‌బిఐ, ఎస్ఎంఇ బ్రాం చ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ బ్యాంకు చిన్న, మధ్యతరహా వ్యాపారవేత్తలు రోజువారి లావాదేవీల నిర్వహణ కోసం బ్రాంచ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు ఇతర బ్రాంచ్‌లలో తమ కార్యకలాపాలు కొనసాగించేందుకు వ్యాపారులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నూతన బ్రాంచ్‌ను ప్రారం భించామన్నారు. అనంతరం చీఫ్ మేనేజర్ అమర్, రీజినల్ మేనేజర్ బిఎం విఎల్ నారాయణరావు నూతన బ్రాంచ్‌లో అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ అధికారులు, సిబ్బంది, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎంలో ఉపాధ్యాయులకు సాంకేతిక శిక్షణ

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రాథమిక విద్యా రంగంలో బోధన, అభ్యసనంపై స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం, గవర్నమెంటు ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధునిక సాంకేతిక బోధన పద్ధతులు, అభ్యసనంపై జిల్లా స్థాయి కార్యక్రమాన్ని సోమవారం కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎఇఒ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మన పిల్లలు పోటీపడేలా ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టివి ద్వారా బైజూస్ స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగు పరిచేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎందరో పేద విద్యార్థులకు ఉపయుక్తం అని, ఈ శిక్షణా తరగతులు ఈనెల 15 వరకు ఉంటుందని తెలిపారు. నిర్వహణ కాలంలో 1400 మంది ప్రభుత్వ టీచర్లు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ వి వెంకట రమణ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని నిరసన

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని, లేనిపక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట కమిటీ కన్వీనర్ సిద్దిక్ హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం డిఆర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గత ఏడాది ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా 6,100 కానిస్టేబుల్స్, 411 ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఈ ఏడాది జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఫిజికల్ ఈవెంట్స్ మాత్రమే నిర్వహించలేదన్నారు వాస్తవానికి మార్చి 14న నిర్వహించాల్సి ఉండగా అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో వాయిదా వేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు ఆరు నెలలు గడుస్తున్న వాయిదా వేస్తూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నోటిఫికేషన్‌లో జైల్ వార్డెన్ పోస్టుల ప్రస్తావనే లేదన్నారు. దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత పోస్టులతో నోటిఫికేషన్ రావడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు లోనయ్యారని పేర్కొన్నారు. ఇప్పుడు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించకుండా జాప్యం చేస్తూ

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగ అభ్యర్థులు

నిరుద్యోగులను మరింత మోసం చేస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, విజయ్, యూసఫ్, సురేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర, నగర అధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.

9న ఫ్యాప్టో జిల్లా సదస్సు

కడప అర్బన్ : ఉపాధ్యాయుల, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చేపట్టిన మూడవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న కడపలోని యుటిఎఫ్ భవన్ లో నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సిఎస్ఐ హైస్కూల్ ఆవరణలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా అపరిష్కృతంగా మిగిలి ఉన్నాయన్నారు. వీటి సాధన కోసం ఎన్నోసార్లు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకుండా మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో జీవో 117 అమలు చేస్తూ విద్యారంగాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి పాఠశాలల తనిఖీ పేరుతో ఉపాధ్యాయులను, విద్యా శాఖాధికారులను భయభ్రాంతులను చేయడం తగదన్నారు. బోధనేతర కార్యక్రమాల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రెటరీ జనరల్ చెన్నుపాటి మంజులతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ సదస్సులో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్(257) రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కె.బాల గంగిరెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి పాలెం మహేష్ బాబు, నాయకులు గురు మోహన్, ఏపీటీఎఫ్(1938) నాయకులు ఆర్.అబ్దుల్లా, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకట సుబ్బారెడ్డి, బిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి హరి కొండయ్య ఎపిటిఎఫ్ (257)జిల్లా నాయకులు ఖాదర్ బాషా పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అన్ని సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-అట్లూరు

మాట్లాడుతున్న తహాశీల్దార్ శ్రీవాణి

జగనన్న సురక్షలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడిఒ సుజాతమ్మ పేర్కొన్నారు. స్థానిక అట్లూరు సచివాలయంలో జగనన్న సురో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పంచాయతీలో వాలంటీర్లు 1484 ఇండ్లను సర్వే చేయగా 201 గృహాలు లేవని తేలిందని, 182 మందికి సమస్యలను పరిష్కరించామని 19 మందికి వివిధ రకాల సమస్యలు ఉన్నాయని వాటిని త్వరలో పరిష్కరిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరి రామకృష్ణారెడ్డి, జిల్లా పశువర్ధక శాఖ అధ్యక్షులు మాధవరెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ ఎం మల్లికార్జునరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హమీద బేగం సిహెచ్ఒ మురళి, ఎంఇఒ విలియం రాజు, సర్పంచ్ ఎల్లమ్మ, వైసిపి నాయకులు రెడ్డయ్య ,పెంచల్ రెడ్డి కృష్ణారెడ్డి మండల ఎస్‌సిసెల్ సెల్ అధ్యక్షుడు సుబ్బరాయుడు ఈశ్వర్ రెడ్డి అంగన్వాడీ టీచర్స్ వాలంటీర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్ :** స్థానిక ఒకటవ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, పంచాయతీరాజ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పి. నాగార్జునరెడ్డి హాజరయ్యారు. అనంతరం తిమ్మారెడ్డిపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మిత్ర యోగా సెంటర్‌లో గురుపూర్ణిమ వేడుకలు

కడప అర్బన్ : కేరళ, గూడూరు శ్రీ శివానంద అంతర్జాతీయ యోగా, వేదాంత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పటేల్ రోడ్‌లో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో గురు పూర్ణిమ సందర్భంగా సత్సంగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శివానంద తపశ్విని ఆశ్రమం నిర్వాహకులు సందీప్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 16 వరకు 'ఫ్యామిలీ యోగా' పేరుతో కుటుంబ సభ్యులందరికీ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఇంటెక్ కడప చాప్టర్ కన్వీనర్ మానస చిన్నపరెడ్డి యోగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యోగా నిపుణులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, డాక్టర్ కె. కల్పన, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కె. జనార్దన్ రాజు, మిత్ర యోగ సెంటర్ యోగ సాధకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సభ్యులు పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో .. కడప :** గురుపూజోత్సవాన్ని సోమవారం కడప ప్రభుత్వ పురుషుల కలశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని సంస్కృత విభాగం నిర్వహించిన ఈ గురుపూజోత్సతవనానికి ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అనంతపురం ఎస్-ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల సంస్కృత ఆచార్యులు, రిటైర్డ్ ప్రిన్సిపల్ నాగ త్రిశూల పాణి, కళాశాలలోని సంస్కృత విభగాధిపతి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎందరో విద్యార్థిని విద్యార్థులు, ఆంగ్ల శాఖధిపతి సివి విశ్వనాథరావు పాల్గొన్నారు.

నెల్లూరు, అనంతపురం జట్లు విజయం

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లలో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో చిత్తూరు జట్టుపై 7 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 44.5 ఓవర్లలో 168 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం 169 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో అనంతపురం జట్టు 72 పరుగుల తేడాతో కర్నూలు జట్టుపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు నిర్ణిత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది. 289 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసి ఓటమి చెందింది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

2024 జనవరి ఒకటవ తేదీ నాటికి 18 ఏళ్ళునిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించేలా అధికారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2024 అమలుపై జేసీ గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ గంగాధర గౌడ్‌తో కలిసి జిల్లాలోని అన్ని పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడిని ఓటరు జాబితాలో చేర్చుటకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకోసం అన్ని పోలింగ్ స్టేషన్లలో రేషనలైజేషన్ ప్రక్రియను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ ఇంకా ఓటరు లిస్టులో పేర్లు నమోదు చేసుకోని అర్హులైన వారంతా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. అనం తరం త్రైమాసిక పరిశీలనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ లోని ఈవిఎం గోడౌన్ల (స్ట్రాంగ్ రూమ్)ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమ క్షంలో కలెక్టర్ పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన ఇవిఎంలను భద్ర పరిచిన గోడౌన్ల రికార్డు లను, రిజిస్టర్లను పరిశీలించారు. ఇవిఎంల స్థితి, లోపాలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ జ్ఞానేంద్ర ప్రసాద్, జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని ఆవాజ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మహబూబ్ నగర్ వీధిలో ఉన్న ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్ ఆవరణంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. అనంతరం కార్యక్రమం ఉద్దేశించి ఆవాజ్ కమిటీ కడప జిల్లా అధ్యక్షులు పి.చాంద్ బాషా, బద్వేల్ పట్టణ ఆవాజ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, అన్వర్ బాష మాట్లాడుతూ సుమారు మూడు లక్షల జనాభా కలిగి ఉన్న బద్వేల్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా పదవ తరగతి పాసైన విద్యార్థులు 11,12 తరగతులు విద్యాభ్యాసం చేయాలంటే కడప , ప్రొద్దుటూరు , దూర ప్రాంతాలకి వెళ్లి చదువుకోవాలంటే విద్యార్థులు తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేక చదువును మధ్యలోనే ఆపేస్తున్నారన్నారు. ఈ పాఠశాలలో 180 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మూడు సంవత్సరాల నుంచి బద్వేల్ పట్టణంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయించాలని అధికారులు , ప్రజాప్రతినిధులు అనేక దఫాలుగా చెప్పిన ప్రయోజనం లేదని వాపోయారు. ఏర్పాటు చేయకపోతే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జ్యోతిరావు పూలే ఆశయ సాధన కమిటీ చైర్మన్ గురుమూర్తి, కాంగ్రెస్ పార్టీ బద్వేల్ నియోజకవర్గం యువజన అధ్యక్షులు, మహీర్, ఆవాజ్ నాయకులు మస్తాన్ ,ఖాజా గౌస్, నాగూర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అటవీ భూముల స్వాధీనం హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

మైదుకూరు మండలం నంద్యాలంపేట సర్వేనెంబర్ 506, 507లో ఆక్రమణకు గురైన అటవీ భూములు 300 ఎకరాలు అటవీ అధికారులు స్వాధీనం చేసుకోవడం పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ అటవీ భూమి 300 ఎకరాలు స్థానిక శాసన సభ్యుడు, ఆయన అనుచరులు ఆక్రమించి బోర్లు వేసుకుని, విద్యుత్ కనెక్షన్లు తీసుకుని మామిడిని సాగు చేశారన్నారు. అటవీ భూమిలో బోరుకు, విద్యుత్ కనెక్షన్‌కు అధికారులు ఏ చట్టానికి లోబడి అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. కుందూలో అక్రమ ఇసుక తవ్వకాలపై కోర్టుకు వెళ్లిన వైసిపి నాయకులు ఇసుక దోపిడీ ఆపలేదన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను, భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ వైసిపి పాలనలో ఆ పార్టీ నేతలు సహజ వనరులను దోచుకుంటున్నారని విమర్శించారు.

టైలరింగ్ సెంటర్ ప్రారంభం

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో చిత్తా లూర్దు మర్రెడ్డి టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ను గీత థామస్ రెడ్డి చిత్తా దంపతులు ఏర్పాటు చేశారు. సోమవారం కార్యక్రమానికి రంగసముద్రం గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్తా. రవి ప్రకాష్ రెడ్డి, గిరి ప్రణీత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై టైలరింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుటుంబమంతా సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ విద్యా, వైద్య, ఉపాధి కల్పనల ద్వారా అనేకమందికి సేవలందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలన్నారు. కార్యక్రమానికి శిక్షణ పొందడానికి హాజరైన 20 మంది విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఇఒగా గంగిరెడ్డి

చెన్నూరు : మండల విద్యాశాఖ అధికారిగా గంగిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నందలూరు మండల విద్య శాఖ అధికారిగా ఉంటూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి పాఠశాలనూ తనిఖీ చేయడంతో పాటు ఉపాధ్యాయుల బోధనా తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటామన్నారు. సులభతరంగా అర్థమయ్యేలా విద్యా బోధన ఉండే విధంగా చర్యలు చేపడతామని అన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని గాంధీ సర్కిల్ చెన్నారెడ్డి కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తొలగించాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, తూగుట్ల సిద్ధారెడ్డి, కాలనీ మహిళలు కోరారు. ఆ మేరకు సోమవారం వారు ఆర్‌డిఒ వెంకటేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి కాలనీ మహిళలు మాట్లాడుతూ ఇళ్లకు దగ్గరలో మద్యం దుకాణం ఉండడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రధాన రహదారి అక్కడే ఉండడం వల్ల ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే భయమేస్తోందన్నారు. అక్కడే మద్యం సేవిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఈ దుకాణాన్ని మార్చాలని మూడు నెలల క్రితం కోరామని, అయినప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే మహిళలమంతా కలిసి పెద్ద ఎత్తున మద్యం దుకాణం ఎదుట ధర్నా చేస్తామని వారు ఆర్‌డిఒకు వివరించారు. ఇందుకు ఆర్‌డిఒ స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

ఆర్‌డిఒతో మాట్లాడుతున్న కాలనీవాసులు

ఖాజీపేట ఎస్‌ఐగా రాజరాజేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట ఎస్‌ఐగా రాజరాజేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెండ్లిమర్రి ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ ఉన్న ఎస్‌ఐ కుళ్లాయప్ప బదిలీపై వెళ్లారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రాజరాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి సారించినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ట్రాఫిక్‌పై ప్రత్యేకదృష్టి సారించనున్నట్లు వివరించారు.

మహిళా సంక్షేమం కోసం 'మహాశక్తి'

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి అధికారంలోకి రాగానే మహిళల సంక్షేమం కోసం మహాశక్తి పేరుతో పథకాన్ని ప్రారంభిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. పల్లవోలు గ్రామంలో సోమవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన, వెనుకబడిన ప్రజలందరికీ న్యాయం జరిగేలా టిడిపి పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. రైతన్నకు తెలుగుదేశం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టిడిపి మండల నాయకులు వైవి సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, సుదర్శన్. పల్లవోలు రామాంజనేయులు, రామ్మోహన్, నాయాబ్ రసూల్, ఎన్ఆర్ఐటి అబ్దుల్ కరీం, నారపురెడ్డి, మిల్లు శీను, కొండపల్లి ఉమాకాంత్, మధు, రవీంద్ర, సలీం, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

నేడు చెముళ్లపల్లెలో 'పుట్టా' పర్యటన

ఖాజీపేట : టిడిపి చేపట్టిన భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చైతన్య యాత్రను మంగళవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ చెముళ్లపల్లెలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం దారుణం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం దారుణమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఇంటి స్థలాలపై రిజిస్ట్రేషన్ ఛార్జీలు 50 నుండి 100 శాతం వరకు పెంచడం పేదలపై భారం వేయడమేనని తెలిపారు. పేద ప్రజలపై భారాలు వేయడం వైసిపి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. వేంపల్లెలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక చదరపు అడుగు రూ.1,300 ఉన్న దాన్ని రూ.1800, రూ.2వేలు ఉన్న దానిని రూ.2500కు పెంచారన్నారు. కొన్ని ప్రాంతాల్లో చదరపు అడుగుకు రూ.3500 ఉన్న వాటికి రూ.4వేలు నుండి రూ.5వేలకు వరకు పెంచారన్నారు. గతంలో యూజర్ ఛార్జీలు ఒక్క డాక్యుమెంటుకు రూ.250 ఉంటే ప్రస్తుతం దాన్ని రూ.550 చేయడం అన్యాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని రకాల ఛార్జీలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ఎద్దుల శేషారెడ్డి, మహబూబ్ షరీఫ్, కృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు

పులివెందుల - ప్రజాశక్తి రూరల్

గురు పౌర్ణమి వేడుకలను సోమవారం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సాయిబాబా మందిరాలన్నీ మహిళా భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు మురళి ఆధ్వర్యంలో పార్నపల్లి రోడ్డులో ఉన్న సాయిబాబా మందిరంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శ్రీరామ్ అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున ఆలయ సమీపంలో అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఎర్రగుంట్ల : స్థానిక మహేశ్వర్ నగర్ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

క్రైం కార్నర్

నాటుసారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని నేలవరం తండాలో తయారు చేస్తున్న నాటుసారా ఊటను సోమవారం పోలీసులు ధ్వంసం చేశారు. సిఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తండాకు చెందిన కంభం శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి అరటి చెట్లు మధ్య నాటుసారా ఊటను తయారు చేస్తుండడాన్ని గమనించి 5లీటర్లను ధ్వంసం చేశారు. శ్రీనివాసులు రెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.

ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఉచితమన్నారు.. మెలిక పెట్టారు

- పశు పోషకుల ఆశలపై నీళ్లు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పశు బీమా కోసం వాటి పోషకులు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని.. జగనన్న పశు నష్ట పరిహారం పథకంలో బీమా ప్రీమియం రైతు తరఫున ప్రభుత్వమే చెల్లిస్తుంది. సంబంధిత పశువు మరణిస్తే పరిహారం సొమ్ము ఆ రైతు ఖాతాలోకి నేరుగా జమ అవుతుందని రెండేళ్ల క్రితం ప్రజాప్రతినిధులు, అధికారులు ఊదరగొట్టారు. దీంతో పశు పోషకులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. ప్రస్తుతం మాట మారుస్తూ ఉచితం కాదని.. కొత్తగా అమల్లోకి వచ్చిన వైఎస్ఆర్ పశుబీమా పథకం ప్రకారం ప్రీమియం చెల్లించిన వారికే వర్తిస్తుందంటూ కొత్తగా మెలిక పెట్టారు. దీంతో పాడి రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం ప్రీమియం చెల్లించాలనే నిబంధనతో పశుపోషకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ఆర్ పశుబీమా పథకంలో గేదెలు, ఆవులు, గొర్రెలతోపాటు పందులను కూడా చేర్చారు. ఒక్క పశుపోషకుడు గొర్రెలు, మేకలు, పందులను 50 వరకు బీమా చేయించొచ్చు. రేషన్ కార్డ్ కలిగిన రైతులు రూ.30 వేలు విలువ చేసే పశువుకు మూడేళ్ల కాలపరిమితికి రూ.384, రేషన్‌కార్డ్ లేని వారు రూ.960 చెల్లించాలి. రూ.30 వేలు దాటిన వారికి ప్రీమియం పెరుగుతుంది. గొర్రెలు, మేకలకు ఒకటి, రెండు, మూడేళ్లు బీమా చేయించుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ రేషన్‌కార్డ్ కలిగిన రైతు గొర్రె లేక మేకకు ఒకటి రెండు మూడేళ్లకు వరుసగా రూ.30, రూ.54, రూ.75, అధిక ఆదాయం గల రైతులు రూ.90, రూ.135, రూ.187.50 వంతున ప్రీమియం చెల్లించాలి. చనిపోయిన గొర్రెలు, మేకలకు ఒక్కో దానికి రూ.6000 ప్రకారం 50 మేకల వరకు పరిహారం చెల్లిస్తారు.

ట్యాగ్ ఉంటేనే బీమా

పశువులకు బీమా చేయించే రైతులు వాటికి ట్యాగ్ వేయించుకోవాలి. బకాయి లేకుండా ప్రీమియంలు చెల్లించినప్పుడే బీమా అందుతుంది. బీమా చేయించేందుకు సమీపంలోని ప్రభుత్వ వైద్యుడ్ని కలిసి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. ట్యాగ్ లేని పశువులకు పరిహారం అందదు.



- డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, ఎడి, పశుసంవర్ధక శాఖ, జమ్మలమడుగు

పులివెందులకే జగన్ ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం పులివెందులకే ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పులివెందులకు మాత్రమే వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ, మిగిలిన ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించారన్నారు. ఆయన అభివృద్ధి వదిలేసి కేవలం బటన్ నొక్కడమే పనిగా పెట్టుకున్నారన్నారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. దీంతో సర్పంచులు అభివృద్ధి చేయలేక నిస్సహాయస్థితిలో ఉన్నారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని మాట తప్పారని వరద విమర్శించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక సొంత బ్రాండ్ లిక్కర్ అమ్ముతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పులివెందులకే పరిమితం కాకుండా రాష్ట్రాభివృద్ధి వైపు ముఖ్యమంత్రి దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టిడిపి నాయకులు అమీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

విద్యుత్ భారాన్ని ఉపసంహరించుకోవాలి

మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలు, రైతులపై మోపుతున్న విద్యుత్ భారాన్ని వైసిపి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అధ్యక్షతన విద్యుత్ చార్జీలు పెంపు, డిజిటల్ మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా అఖిలపక్ష పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. తులసిరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్య ప్రజలపై రూ.17,723 కోట్లు అదనపు భారం వేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలకు శాపాలుగా మారాయని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను రద్దు చేసి ప్రజలపై ఉన్న భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొత్త కాలువ బ్రహ్మం, టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, ఆమ్మ అద్మీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, శర్మ, వేమయ్య, వినయ్, సుబ్బరాయుడు, సుబ్రమణ్యం, బద్రి, రవి, శివ, రాఘవయ్య పాల్గొన్నారు.

కళ్లముందే కూతురు తిరిగిరాని లోకాలకు..

- అక్షరాలు దిద్దడానికి వెళుతూ ప్రమాదం.. తల్లడిల్లిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కళ్ల ముందరే కూతురు మృతి చెందిన సంఘటన జమ్మలమడుగులో చోటుచేసుకుంది. సోమవారం గౌస్‌బాషా తన ఇద్దరు కుతుళ్లను బైక్‌లో కూర్చోబెట్టుకుని పాఠశాలకు అతి సమీపంలోకి రాగానే.. ముందు చిన్న ఆటో రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయగా బైక్ స్కిడ్ అయి, పిల్లలిద్దరు చెరోవైపు కిందపడ్డారు. ఎడమవైపు పడిన పాపకు ఎలాంటి ప్రమాదంలేదు. కుడి వైపు పడిన చిన్న కూతురు సఫీనా (5) ఎదురుగా వస్తున్న ఓ ప్రయివేట్ పాఠశాల వ్యాన్ వెనుక టైర్ తలపై ఎక్కింది. పాప అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి చూస్తుండగానే బిడ్డ ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండ్రి ప్రాణం విలవిల్లాడింది. గుండెలు అవిసేలా ఏడ్చాడు. పది సెకన్లు ఆగి ఉంటే పిల్లలు పాఠశాలలో ఉండేవారు. ప్రమాదం తెలుసుకున్న పాప తల్లి రేష్మ రోదన పలువురిని కంటతడి పెట్టించింది. సఫీనా పట్టణంలోని విశ్వజ్యోతి పాఠ శాలలో నర్స రీ చదువుతోంది. అదే స్కూల్ వ్యాన్ కింద పడి చనిపోవడం చూసి, అక్ష రాలు దిద్దాడానికి వెళుతూ.. అనంతలోకాలకు చేరడం చాలా బాధాకర మని అక్కడున్న వారు విలపించారు. బాలిక తండ్రి డి.గౌస్‌బాషా ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. దర్యాప్తు చేస్తామన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

స్థానిక ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి సఫీనా మృతి చెందడం చాలా బాధాకరమని విద్యార్థి ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా సహాయ కార్యదర్శి గండి సునీల్, వినయ్‌కుమార్, ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, ఆర్‌డిఎస్‌యు ఓబులేసు, పిడిఎస్‌ఒ ఓబులేసు, పిడిఎస్ ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుష్పరాజు, ఆర్‌విపియస్ రాష్ట్ర కార్యదర్శి కెసి పాములేటి, విద్యార్థి సంఘ నాయకులు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరీ కమిటీ మెంబర్ మేకల ఆంజనేయులు, ప్రజాసంఘ నాయకులు రాజు, జైచంద్ర, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సఫీనా (ఫైల్‌ఫొటో)

ప్రొద్దుటూరులో అభివృద్ధి శూన్యం : సిపిఎం

మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో అభివృద్ధి శూన్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పేదల భూములు ఎలా కాపాడుకోవాలో బోధపడడంలేదన్నారు. సమాజంలో అశాంతి ఏర్పడి హత్యారాజకీయాలకు దారి తీస్తోందని ఆరోపించారు. నేరచరిత్ర కలిగిన వారిని పరిశీలించి వారివద్ద ఉన్న లైసెన్స్ తుపాకులు స్వాధీనపరుచుకొని వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలన్నారు. ప్రతి రోజు వారి కదలికలను గమనించాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తతతో వ్యవహరించి భూ దందాలు చేసే వారిపై కేసు నమోదు చేసి ఎప్పటికప్పుడు జైలుకు పంపాలన్నారు. భూ దందాలను అదుపు చేయాలన్నారు. కడప ఉక్కు శంకుస్థాపనకే పరిమితమైందని తెలిపారు. జగనన్న ఇళ్లు ఎక్కడా పూర్తికాలేదన్నారు. ప్రొద్దుటూరు మురికి కూపంగా మారిందని ఆరోపించారు. సొంత జిల్లాకు కూడా సిఎం జగన్ నిధులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాల నిధులు, రాష్ట్ర నిధులు నవరత్నాలకు మళ్లిస్తున్నారని తెలిపారు. విద్యుత్ బిల్లుల పెంపుపై మోడీ, జగన్‌పై ప్రజల్లో ఆగ్రహం తెప్పిస్తోందన్నారు. వైసిపి పాలనలో వివిధ వర్గాల్లో పెరుగుతున్న ఆందోళన జిల్లాలో వైసిపి ప్రతిష్ట గ్రాఫ్ పడిపోతోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు శేఖర్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

ప్రజాశక్తి - ఖాజీపేట

అకాల వర్షాలతో పంట నష్ట పోయిన ప్రతి రైతుకు పరిహారం అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పుల్లూరు రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 8న రైతు దినోత్సవం సందర్భంగా పరిహారాన్ని రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. పుల్లూరు సచివాలయం పరిధిలో పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి గురించి సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు గురించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. మండలంలో 3,273 మంది రైతులకు రూ.8,88,84,596 పరిహారం రైతులకు మంజూరైందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ డివిజనల్ సహాయ సంచాలకులు సుబ్బారావు, వ్యవసాయ అధికారి నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

పేదలందరికీ ఇళ్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రంలో పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలనేది సిఎం జగన్ లక్ష్యమని వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అన్నారు. ఒకటవ సచివాలయం పరిధిలో సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. సమాజంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా చేయాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

కుష్టు వ్యాధి సర్వే పక్కాగా చేయాలని అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి సూచించారు. ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సర్వే చేసిన ప్రాంతాలకు వెళ్లి అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కుష్టు వ్యాధి అనుమానిత కేసులను పిహెచ్‌సికి పంపించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న నేషనల్ ప్రోగ్రామ్స్ ఎలా చేస్తున్నారనే దానిపై సిబ్బందిని అడిగి తెలుసుకుని, తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో బి. మఠం మెడికల్ ఆఫీసర్ మల్లేష్, హెల్త్ అసిస్టెంట్ మాధవ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేపై ఆరా తీస్తున్న అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి

రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

- టిడిపి రాష్ట్ర నాయకుల రాక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేదలకు కడుపు నింపడానికి ఉద్దేశించిన అన్న క్యాంటీన్ బుధవారం ప్రారంభించనున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. స్థానిక పిఎన్ఆర్ కళ్యాణమండపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్ నాయుడు మాట్లాడుతూ తన సొంత నిధులతో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పిఎన్ఆర్ హాలులో ఉచితంగా భోజన వసతి కల్పించడంతోపాటు మొబైల్ వ్యాన్ ద్వారా ప్రతిరోజు వెయ్యిమందికి అన్నదానం చేస్తామన్నారు. క్యాంటీన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర నాయకులు అయ్యన్నపాత్రుడు, కాల్వ శ్రీనివాసులు, ఘంటా శ్రీనివాసులు, యనమల రామకృష్ణుడు రానున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం రాజీవ్ సర్కిల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ సురేష్‌నాయుడిని ఆదర్శంగా తీసుకొని స్థోమత ఉన్నవాళ్లు ఇలాంటి క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. టిడిపి కడప పార్లమెంటరీ అధ్యక్షుడు లింగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సురేష్‌నాయుడు తీసుకున్న నిర్ణయం సాహసోపేతమన్నారు. ముక్తియార్ మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేయడం వారి కడుపు కొట్టడమే అన్నారు. టిడిపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు మాట్లాడారు.

మాట్లాడుతున్న సురేష్‌నాయుడు

5న మైనార్టీ నేత దర్బార్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపికి చెందిన మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ ఈనెల 5న టిడిపిలో చేరుతున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. స్థానికంగా సోమవారం రామమునిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దర్బార్ తన అనుచరులు 200 మందితో టిడిపి రాష్ట్ర నాయకులు యనమల రామకృష్ణుడు, అయ్యన్న పాత్రుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, కడప పార్లమెంటు అధ్యక్షులు శ్రీనువాసులురెడ్డి అధ్వర్యంలో చేరుతున్నట్లు తెలిపారు. ఇటీవల కూడా వైసిపి నేతలు టిడిపిలో చేరారని తెలిపారు. వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక వారు టిడిపి పార్టీలో చేరుతున్నట్లు వివరించారు. టిడిపి కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో పాపిరెడ్డి, మహమ్మద్, జబిబుల్లా, దక్కా రమేష్, శ్రీనువాసులు, వేమా నారాయణ, బాలకష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

డిజిటల్ లెర్నింగ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమంపై సోమవారం సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రవిశంకర్ మాట్లాడుతూ పది రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు డిజిటల్ ఎడ్యుకేషన్ పద్ధతిలో బోధించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో చాపాడు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, రాజుపాలెం, జమ్మలమడుగు, కొండాపురం, ముద్దనూరు, దువ్వూరు, మైలవరం, పెద్దముడియం మండలాల ఉపాధ్యాయులు పాల్గన్నారని తెలిపారు. కార్యక్రమంలో బైజూస్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, సిబిఐటి ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, ట్రైనర్స్ కృపాసాగర్, సుబ్బారెడ్డి, ఎంఇఒ వంశీకృష్ణ, ఎంఆర్‌సి సిబ్బంది మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ రవిశంకర్

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక వినాయక నగర్ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి పలు పత్రాలు ప్రజలకు అంద జేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, మెప్మా సిఒ వసంత్, డిపిఒ వినోద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

ముద్దనూరు : ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మండల సచివాలయంల కన్వీనర్ సుమంత్ యాదవ్ అన్నారు. పెనికలపాడు గ్రామంలో సోమవారం జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులకు పథకాలు అందకుంటే ఈ కార్యక్రమం ద్వారా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రావణి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కేశవరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, ప్రతాప్ గౌడ్, రామచంద్రారెడ్డి, సుధాకర్, బాబు, సాంబ, ప్రజలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కోరారు. పురపాలక సంఘం పరిధిలోని ఉలిమెల్ల వార్డు సచివాలయం ఆవరణలో సోమవారం సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు ఆదాయ, వివాహ, జనన, మొదలగు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలోని యుజిడి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజ్, కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు గంగాదేవి, పద్మావతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరు : గుడిపాడు గ్రామపంచాయతీలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఓబులేసు నందన్ అర్హులకు పత్రాలు అందజేశారు. తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, ఎఒ అమర్నాథ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్
సివిల్ జడ్జి,కదిరి
O.S.NO:622/2019
Between:
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు rep by its senior manager. Kadiri,
...Plaintiff
మరియు
D1: K.ప్రసాద్ రెడ్డి S/o S.శివ రెడ్డి, Now R/at అంబకపల్లి, నల్లపరెడ్డి పల్లి, పులివెందుల మండలం
...Defendant
పై దావాలోని D1 ప్రతివాదికి దావా సమన్లు
పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు Kadiri Main Branch వారు) ప్రతివాది D1 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 14/07/2023 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 14/07/2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిద 14/07/2023
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి